# ఖుటే

### మహీధర రామశాస్త్రి

స్సాయంత్రం నుంచి ఇటుకలారీ మీద ఖుటే తడుస్తూనే వున్నాడు. అయినా వాడదేవీ పట్టించు కోకుండా, కొత్త పంట్లాం, కొత్త చొక్కా తొడుక్కున్న సంబరంలో లారీ డ్రైవర్‌లా పోజిచ్చి కూర్చున్నాడు. జీవితంలో మొట్ట మొదటిసారి ఖుటే కొత్తపంట్లాం, కొత్త చొక్కా తొడుక్కున్నాడు. వాటిని ఇటుక బట్టీ యజమాని వాడికి బహుమతిగా యిచ్చేడు.

పదహారేళ్ళ ఖుటేకి తన తండ్రి ఎవరో తెలియదు.

శ్యాల్దా స్టేషన్‌లోకి వెడుతుంటే కుడి వెంపు, గోడవారే కొన్ని గుడిశెలు వరసగా కనిపిస్తాయి. అందులో ఓ గుడిసెలో ఖుటే జన్మించాడు. నాన్నెవరో తెలీని వాడికి నాన్నను తల్చుకోగానే–ఓ ఒంటికాలి మనిషి రూపం కళ్ళ ముందు మెదుల్తుంది. ఆ రూపాన్ని తల్చుకోగానే భయంతో ఖుటే శరీరం ముడుచుకు పోయి వణికి పోయేది. అదంతా పాత కథ.

ఖుటే తల్లి బతాసీ. చిన్న తసంలో ఖుటేని గుడిసెలో కూర్చోబెట్టి వాడి ముందు యిన్ని మొరమరాలు పోసేది. వాటిని వాడు ఒక్కొక్కటే ఏరుకొని తినేవాడు. వాడు తిండి తినే విధానం చూస్తే ముద్దుగా వాడిని వాళ్లమ్మ 'ఖుటే' అని పిల్చుకునేది. వాడి పేరలా ఖుటేగా స్థిరపడింది.

ఖుటే కొంచెం పెద్దయేక శ్యాల్దా స్టేషన్ దగ్గర జన ప్రవాహంలో కలిసి ముష్టి ఎత్తేవాడు. ఒంటి కాలి మనిషి వచ్చి చంకల కర్రతో చావకొట్టి ఖుటే నుంచి చిల్లర పట్టుకు పోతూ వుండేవాడు. ఖుటేకి చివాట్లు, కర్రదెబ్బలు, శాపనార్థాలు యివన్నీ పరిపాటి అయిపోయాయి.

రాత్రి ఎనిమిదయేసరికి బతాసీ కిరసనాయిలు బుడ్డి వెలిగించి రేకు సూటుకేసులోంచి పగిలిపోయిన అద్దం ముక్కనొకదాన్ని ఎదర పెట్టుకుని ముస్తాబు అయేది. అప్పుడొచ్చి కుంటాడు తన మెడ పట్టుకుని గుడిసె బయటకు విసిరేసేవాడు. తను కసిదీరా వాడి చెయ్యి పట్టుకుని కరిచేసేవాడు. వాడు తన వీపు చీరేసేవాడు. అలాంటప్పుడు కుంటాణ్ణి జయించే ఒకే ఒక మార్గాన్ని ఖుటే కనిపెట్టాడు. అదేవిటంటే వాడు కొట్టడానికి వస్తే పరిగెత్తుకు పోవడం !

ఇంకొంచెం పెద్దయేక దూరం నుంచి తను చూసేవాడు. ఆ కుంటాడు రకరకాల మనుష్యుల్ని తీసుకుని బతాసీ గుడిసెలోకి వెళ్లేవాడు. తర్వాత రూపాయలు లెక్క పెట్టుకుంటూ యివతలకు వచ్చి, ఓవర్ బ్రిడ్జి కడుతున్న చోట – బ్రిడ్జి కింద, కూరల బజారులో ఫుట్‌పాత్ మీద కల్లు అమ్మేవాడి కుండ దగ్గర కూర్చుని కల్లు తాగేవాడు.

అలాంటి ఖుటే వున్నట్టుండి ఒనాడు అన్ని విధాలా అనాధ అయిపోయాడు. ఒరాత్రి ఆఖరి లోకల్ బండి బయల్దేరే ముందు, వాళ్ల గుడిసెల వారే వున్న గోడ పడిపోయింది. పోలీసులు, ఫైర్ బ్రిగేడు మనుషులు వచ్చి నగ్నంగా వున్న బతాసీని, మరో మగాడిని బయటకు తీసినప్పుడు ఆ యిద్దర్లో ఏ ఒక్కరూ ప్రాణంతో లేరు.

తను బతాసీ మెడను కావలించుకుని– 'అమ్మా ! అమ్మా !' అని యేడుస్తూ వుంటే, పోలీసు వచ్చి తన మెడ పట్టుకుని లేవనెత్తి విసిరేశాడు.

'అవతలకి పోరా ! గుడిసేటి లంజకొడకా ! ఇంక యేడుస్తున్నావు !

సరిగా అప్పుడే కుంటాడు వచ్చాడు. అసలు తండ్రో నకిలీ తండ్రో – మొదటిసారి ఖుటే తండ్రి చంక ఎక్కేడు. పోలీసు వాడు విసిరేసిన తనని ఆ కుంటాడు ఎతుకుని, అరవడం మొదలు పెట్టాడు. వాడి అరువులకి అందురూ మూగేరు. ప్లాటుఫాం మీద మైకులో – 'జిందాబాద్ ! ముర్దాబాద్ ! చెలేగానహి ! చెలేగానహి !' అంటూ అరిచే మనుషులూ చేరిపోయారు. ఆ గోలలోనే ఖుటే కుంటాడి భుజం మీద వాలి నిద్దరోయేడు.

ఉదయం మెళుకువ వచ్చేసరికి, తనొక ముసల్దాని పక్కన పడుకుని వున్నాడు. ఆ ముసల్దాని కళ్ల నిండా తెల్లగా పుసులు కట్టి వున్నాయి. ఆ ముసల్దాని పేరు లక్ష్మమ్మ. దానిపక్కనే ఒక పాత గుడ్డల మూట పడివుంది. రాత్రికి రాత్రే తమ గుడిసెలున్న జాగా అంతా శుభ్రం చేసేశారు. ఇప్పుడక్కడ గుడిసెల ఆనవాళ్లు కూడా లేవు. పడిపోయిన గోడ అవతలి వెంపున పెద్దగొయ్యి వుంది. ఖుటేకి ఎవరెవరివో మాటలు వినిపిస్తున్నాయి.

''ఓవర్ బ్రిడ్జి కట్టడం కోసం తెచ్చిన డ్రిల్లింగ్ మెషిన్ కంపనాలకి గోడ పడిపోయింది. ఇద్దరు మనుషులు చచ్చి పోయినట్లు ఉదయం పేపర్లో వచ్చింది ''.

ముసల్ది విరుచుకు పడింది.

'చచ్చినోళ్లు ఏడుగురయితే యిద్దరని రాయడానికి ఆ రాసే సచ్చినోళ్లగ్గాని కళ్లులేవా ?

ఆ ఉదయం జన ప్రవాహం మాములుగా ప్రారంభం అయింది. నిర్వికారంగా జనం మసులుతున్నారు. చెత్తగుట్టల్ని తప్పించుకుంటూ మూత్ర ప్రవాహం ఎదరకు సాగుతుంది. రోజూ ఈపాటి వేళకి బతాసీ ఖుటేకి మట్టి పిడతతో టీ, పులిసిపోయిన రొట్టె పట్టుకొచ్చి పెట్టేది. ఈ వేళ బతాసీ మరిలేదు. తల్లిని తల్చుకోగానే ఖుటేకి ఏడుపొచ్చేసింది. కాస్సేపు యేడ్చేడు.

ఎదురుగుండా ఓ ముసలాడు తన శాంతిపురి పంచెను సవరించుకుంటూ, ఓ అందమైన కుర్రాణ్ణి చెయ్యిపుచ్చుకుని తీసుకు వెడుతున్నాడు ఖుటే వాళ్ల ఎదురుగా వెళ్లి అలవాటుగా చెయ్యి చాపేడు. ముసలాడు పుచ్చుకుక్కలా ముఖాన్ని వికృతంగా మార్చుకొని ఓ మొరుగు మొరిగాడు.

''పోరా ! వెధవా ! పొద్దున్న లేదు. సాయంత్రం లేదు. దరిద్ర మొహం నువ్వూనూ. ఎంతసేపూ కాళీ చెయ్యి చాచడం – ప్రభుత్వ హస్తం లాగాను –పెట్టు ! పెట్టు ! పెట్టమంటూ ! ''

ఆ కుర్రాడు జాలిగా ఖుటేని రెప్పవాల్చకుండా కళ్లప్పగించి చూస్తున్నాడు. ముసలాయన అరువులకి బెదిరిపోయి చూపు తిప్పేసు కున్నాడు. ఖుటే భయంగా గుండె చేత్తో పట్టుకుని రెండడుగులు వెనక్కి వేశాడు.

వెనక నుంచి కుంటాడు వచ్చి ఖుటే రెక్క పట్టుకుని యీడ్చుకుంటూ వెళ్లి పోయాడు.

''నాకాకలిగా వుందీ ! ''

కుంటాడు కళ్లెర్రజేసి చూస్తూ తీవ్రంగా అన్నాడు.

''నిన్న రేత్తిరే నీ తల్లిని మింగేసినావు ! ఇంకా నీ పొట్ట నిండ లేదంట్రా ? ''

అంతలోనే మళ్లీ ఏవనుకున్నాడో –

'' నడు, ఏదోహటి తిందుగాని నడు ! ''

ఖుటే వాడి వెనక నడుచుకుంటూ నీల్‌రతన్

బెంగాలీ కథ
దీప్ భట్టోపాధ్యాయ

ఆసుపత్రి ముందు కొచ్చాడు. ఖుటే అక్కడ ఓ పెద్ద ఎత్తయిన మెషీన్ని చూశాడు.

బతానీ కంఠాని కౌగలించుకుని పడుకునే ఖుటేకి ఈ మిషను శబ్దం వల్ల తల్లి గుండె శబ్దం వినిపించేదికాదు! ఖుటే ఆ మిషను కేసి కోపంగా చూస్తూ కాండ్రించి ఉమ్మేసాడు.

ఈవుదయం ఆసుపత్రి ముందు అంతా ఖాళీగా వుంది. బీహారీ మట్కా చాయివాలా మాత్రం మామూలుగా తిరుగుతున్నాడు. చాయి వాలా భుజాన వేలాడుతున్న సంచీలో మట్టి పిడతలు, పాసిపోయిన రొట్టెలు వున్నాయి. కుంటాడు ఖుటెని తిన్నగా చాయివాలా దగ్గరకు తీసుకువెళ్లి ఓ మట్టి పిడతడు టీ, పావు రొట్టె యిప్పించాడు. ఇప్పించేస్తే ఒంటి కాలితో కప్పలా గెంతుకుంటూ ఆసుపత్రి మెట్లెక్కి లోపలకు వెళ్లి పోయాడు. ఖుటె రొట్టెని టీలో నానేసుకుని తింటూ తన తల్లి నిజంగానే చనిపోయిందా అని ఆలోచిస్తున్నాడు.

వాడెన్నో చావులు చూసాడు. రైలు కిందపడి తెగిపోయిన శవాలను, రోడ్డువీద వాహనాల కింద పడి పచ్చడయిన శవాలను, రోగంతో గుడిసెల్లో చచ్చిపోయిన శవాలను, వాడు చూసాడు. అయినా చావంటే భయం మాత్రం పోలేదింకా తను చావును గురించి ఆలోచించలేడు కూడా తల్లి చాలాసార్లు అనేది.

"నువ్వు చావ్వేరా? చావు.
నువ్వు చస్తే నాకు కాస్త
బరువయినా తగ్గు తుంది!"

రొట్టెని, టీని పూర్తి చేసి ఖుటే ఫుట్‌పాత్ మీద కూర్చుని మామూలుగానే చూస్తున్నాడు–ఒక మహా నగరం తన కళ్ల ముందే నిద్రలోంచి ఎలా ఒళ్లు విరుచుకుని లేస్తూందో! చూస్తుండగా జన ప్రవాహం వరదలా పొంగుతూంది. రకరకాల వాహనాలు ఒకదాని తర్వాత ఒకటిగా అలాసాగు తూనే వున్నాయి. మనుషులు యంత్రాలు కలిసి సృష్టిస్తున్న ఒక విచిత్రధ్వని అవరోహాణ క్రమంలో ఆకాశం అంతటా వ్యాపిస్తూంది. మధ్య మధ్య నల్లని పొగలు భూతాల్లా గాలిలో లేచి మనుషుల కంఠాలు నులిమి వదులుతున్నాయి. తోపుడుబళ్ల పళ్ల దుకాణాలతో ఫుట్‌పాత్ అంతా నిండిపోతోంది. వాటిని చూస్తున్నకొద్దీ ఖుటేకి ఆకలి పెరుగుతూంది.





చిలకలూరిపేట కళానిలయం నిర్వహించిన జాతీయ స్థాయి నాట్య పోటీలలో కూచిపూడి నృత్యంలో ప్రథమ బహుమతి విజేత కుమారి ఆచారి తుషార(కాకినాడ)కి పుష్పాభిషేకం చేసినప్పటి చిత్రం

అలా ఎంతసేపు గడిచిందో తెలియదు. ఎప్పుడొచ్చాడో కుంటాడు ఖుటే ఎదురుగా నిలబడి వున్నాడు. కుంటాడి ప్రక్కన ఆ రేత్రి చూసిన పోలీసు జవాను, వాడి పక్కనే మెళ్లో స్టెతస్కోపుతో ఓ కుర్ర డాక్టరు నిలబడి వున్నాడు. ఖుటేని చూపిస్తూ పోలీసువాడు ఏవేవో సౌజ్ఞలు చేస్తూ డాక్టరుకి చెప్పుకొస్తున్నాడు. ఖుటే ఎంత ప్రయత్నించినా వాళ్ల మాటలు అర్థం కాలేదు- పోస్టు మార్టం, మెడికల్ స్టూడెంటు, మోర్గ్, ప్రొఫెసరు- ఈ పదాల అర్థం తెలియలేదు. ఖుటేకి తెలిసిందల్లా ఏవిటంటే - కుంటాడు తన తల్లి శవాన్ని ఆ బాబుల చేతిలో వదిలి పెట్టేస్తున్నాడని. దాంతర్వాత ఖుటే చాలా ఆశ్చర్యకరమైన విషయం చూశాడు.

పోలీసు జవాను అందరి దగ్గరా డబ్బులు దండుకోవడం తను చాలాసార్లు చూసాడు. ఎప్పుడూ కుంటాడి పొట్టలో లాఠీతో పొడిచి డబ్బులు వసూలు చేసే జవాను, యీవేళ రూపాయి నోట్లు కుంటాడికి లెక్క పెట్టి అందిస్తున్నాడు. ఆశ్చర్యంగా నోరు వెళ్ల బెట్టి చూస్తున్న ఖుటే నోటి నుంచి చొంగ కిందకు దారలు కట్టింది. ఆ తర్వాత ఖుటే ఆ కుంటాణ్ణి మళ్లా చూడలేదు. అలవాటు ప్రకారం ఖుటే శ్వాల్దా స్టేషను కేసి నడిచాడు.

అలా స్టేషనుకి చేరిన ఖుటే కొన్నాళ్లు ముష్టి ఎత్తుకున్నాడు. తర్వాత కొన్నాళ్లు ఓ టీ దుకాణంలో గ్లాసులు కడుక్కుని బతికాడు. ఆ తర్వాత పడుపు వృత్తిలో వున్న స్త్రీలకు విటులను తీసుకు వచ్చే పని కూడా చేసాడు. శ్వాల్దా స్టేషనులో స్వైరిణులే ఎక్కువ. తమ విటులను తామే వెతుక్కుంటారు. కాని, ఖుటేని చిన్న తనం నుంచీ ఎరిగిన కొందరు స్త్రీలు ఖతానీ వీదిగల అభిమానంతో ఖుటేవీద జాలిపడి ఆ పనిలో పెట్టుకున్నారు.

ఆవృత్తిలో వుండగానే ఖుటే యువకుడయిపోయాడు. లక్ష్మయ్య మనవరాలు 'దులి' పదహారేళ్ల చిన్నది. బెలియా ఘాటా బ్రిడ్జి కింద ఓ గుడిసెలో వుంటుంది. ఓ రోజు ఖుటేని తన గుడిసెలోకి తీసుకువెళ్లి ఖుటే చేతిని తీసుకుని తన గుండెల వీద వేసుకుని అదుముకుంది. ఖుటేకి ముచ్చెమటలు పోసాయి ఆ చర్యకి. నగ్నంగా వున్న ఆడా మగ శరీరాలు ఖుటే చాలాసార్లు చూసాడు. వీధుల్లో కలిసే కుక్కలు తలపుకొచ్చి అసహ్యం కలిగేదే తప్ప ఆనందం కలగలేదు. జంతవులకీ మనుషులకి తేడా ఏవిటంటే మగాడు డబ్బులు చెల్లించాల్సి వుంటుంది! అంతే

## విశిష్ట భారతీయునికి లక్ష రూపాయలు బహుమతి

గత యేడు సంవత్సరాలుగా పలు రంగాలలో విశిష్ట కృషి చేసిన ప్రముఖులకు అవార్డులు యిస్తున్న శ్రీ యార్లగడ్డ రాజలక్ష్మి-వెంకన్నచౌదరి కళాపీఠం వారు కొత్తగా లక్ష రూపాయల అవార్డును ఒక దానిని ప్రవేశపెట్టారు. ఈ అవార్డును విశిష్ట భారతీయునికి 1987 ఏప్రిల్ 6వ తేదిన శ్రీ వెంకన్నచౌదరి వర్ధంతి నాడు బహూకరిస్తారు. 1986వ సంవత్సరపు "విశిష్ట భారతీయుడు అవార్డు విజేత" పేరునుత్వరలో ప్రకటిస్తారు.

గుడిసెలకి విటులను తీసుకువచ్చే రోజుల్లో ఖుటేకి ఒక లారీ డ్రైవరుతో పరిచయం అయింది. ఆ పరిచయ భాగ్యం వల్ల తనిప్పుడు ఇటుక లారీ వీద కళాసీ అవగలిగాడు.

రాత్రి చాలా పొద్దు పోయింది. ఖుటే కేబిన్‌లోకి దూరి స్టీరింగును అటూ యిటూ తిప్పుతూ తను లారీ డ్రైవరు అయితే ఎంత బాగుండును?- అని కలలు కంటున్నాడు. అలా తలుచుకోగానే ఆనందం కలిగింది. తన లారీ ఈ చామతి నదిఒడ్డున ఈటిండా ఘాట్ నుంచి చేపలు తీసుకుని, బసీర్‌హాట్, స్వరూప్ నగర్, బెరా చాపా, బారాసాత్‌ల మీదుగా జెసోర్ రోడ్డు పట్టుకుని కలకత్తా వెడుతూంది. తోవలో టైరు బద్దలయి బండి నిలబడి పోయింది. దోమల దండు కాళ్లు పట్టుకుని పీకడంతో ఖుటే కల చెదిరిపోయింది. బయటకు వచ్చి బంపరు మీద కూర్చున్నాడు.

డ్రైవరు సారా తాగడానికి వెళ్లి వుంటాడు. సరుకు దొరికితే మరి వెనక్కి వచ్చే ఆశ వదులుకోవచ్చు. ఖుటే దృష్టి ఎదురుగావున్న 'చంద్రకేతుగడ్' సైన్ బోర్డు వీద పడింది. డ్రైవరు తనకి చెప్పేడోసారి. అక్కడ పురావస్తు శాఖవారు మట్టి తవ్వి కొన్ని విలువయిన వస్తువులను బయటకు తీశారని. కలకత్తా నుంచి చాలా పెద్ద పెద్ద దొరబాబులు వచ్చి ఈ మట్టి కింద దొరికిన కుండ పెంకులు చూసుకుని మురిసిపోతూ వుంటారట. బోర్డు కేసి చూస్తూ ఖుటే ఆలోచిస్తున్నాడు.

తనూ చ దువుకుని వుండి వుంటే- బాబుల్లా మట్టి తవ్వుకుని కుండ పెంకులు ఏరుకోవడం కాక, తనకి చుట్టాలు పక్కాలు ఎవరయినా వున్నారో లేదో వెతుక్కుని వుండేవాడు. ఆలోచిస్తూ వుండగా ఖుటేకి వెర్రిగా ఆకలెయ్యడం మొదలెట్టింది. లేచి చీకట్లో ఎదురుగా కనిపించే పల్లెటూరి సంతపాకల కేసి నడవడం మొదలెట్టాడు. పొద్దుణుంచీ అలా జల్లు పడుతూనే వుండడం వల్ల సంత బాగా జరగలేదు.

ఖుటేకి ఈ ప్రాంతం కొత్త. తార్రోడ్డు పక్కన దుకాణాలు మూసేసి వున్నాయి. ఎక్కడా మనిషి సంచారం లేదు. అక్కడక్కడ బురద బురదగావుంది. దూరంగా గుడ్డిదీపాలు వెలుగుతున్నాయి. జల్లు మూలాన అంతటా నిశ్శబ్దంగా వుంది. మూసేసిన ఓ టీ దుకాణం ముందు, ఆరిపోయిన పొయ్యి బూడిదలో ఒకుక్క ముడిచిపెట్టుకు పడు కుందీ. ఖుటే పాదధ్వనికి ఓమారు బొయ్యిమని మళ్లీ కళ్లు మూసుకుంది. మరో ఖాళీగుడిసె పక్కన కుండలు, మండలు, మట్టి పాత్రలు తిన్న కుండలా పేర్చి వున్నాయి. కుళ్లిపోగా పారేసిన కూరల పోగులు వీధిలో అక్కడక్కడ పడివున్నాయి. సంత పాకల్లో పందిరిరాటలకు కట్టిన ప్లాస్టిక్ గుడ్డలు జెండాల్లా ఎగురుతున్నాయి.

తిరిగి తిరిగి ఖుటె సంతపాకల వెనక్కి వచ్చేడు. అక్కడ ఓ పాక ముందు ఎవరో కూర్చుని వున్నారు. ఓ పెద్ద ఇలాయి బుడ్డి దీపం వెలుగుతూ దట్టంగా పొగలు చిమ్ముతూ గోడ మీద నీడలు సృష్టించి ఆడిస్తూంది. ఆ పక్కనే సైడు కాలువలో వాన నీరు గల గల పారుతూంది. పాక వెనక దట్టమైన చీకట్లో వెదురు గుబురుల్లో గాలికి గడ కర్రలు గరగర రాసుకుంటున్న చప్పుడు- కప్పల బెక బెకలతో కలిసిపోతుంది. అడుగులో అడుగు వేసుకుంటూ ఖుటె పాక ముందుకు వచ్చేడు.

దీపం కాంతిలోంచి ఓ నడివయసు స్త్రీ ఎదరకు వచ్చింది-.

"అరె! రా! రా! సందేళ నుంచి కూకుని ఎదురు సూత్తన్నా. ఓ మగదోమయినా యిటొచ్చినాడి కాదు!

ఖుటె మరో అడుగు ఎదరకు వెయ్యగానే ఆ స్త్రీ నడుం మీద కుడి చెయ్యి వేసుకుని, ఎడం చెయ్యి చెంపకు చేర్చుకుని విస్తుపోతూ వింతగా చూస్తూ నిలబడి పోయింది.

తర్వాత నుదురు కొట్టుకుంటూ- "కర్మరా!

నాయినా! గుంటనాకొడుకువా?''

అనేసి లోపలికి తిరిగి ఓ కేక పెట్టింది. ''ఓ! టగరీ నువ్వు రామే! ఈగుంటోణ్ణి ఒల్లడం నావొల్ల గాదు' పాలుగానీ తాగేసి పోతాడను కుంటా!''

అంటూ పిశాచినిలా ఆమె నవ్విన నవ్వు చీకట్లో కలిసిపోయింది. పాతికేళ్ళ వయసులో వున్న టగరీ, మరో ఇద్దరమ్మాయిలు యువతలకు వచ్చి నిలబడ్డారు.

టగరీ కన్ను గీటుతూ అంది.

''ఒరసంలో తడుస్తూ అలా నిలబడి పోనావేం? పైకిరా! పైకిరా!''

ఖుటెలో అంతవరకు కలిగిన భయం, సంకోచం మాయం అయిపోయాయి! వెల్లవేసు కున్నట్టున్న ఆ వెడెరు ముఖం, దట్టంగా పులుము కున్న కాటుక, ఎర్ర రంగు పావుకున్న మోటు పెదాలు, ఆ మాట తీరూ ఖుటెకి చిన్నతనంనుంచి పరిచితాలే. నడవలోకి అడుగు పెడుతూ ఖుటె అన్నాడు.

''నాను బాబునేంగాను! ఆకలిగుంటే తింటాని కేటేనా దొరుకుద్దేమోనని యిటుకేసి వొచ్చి నాను!''

టగరీ చీరను మోకాళ్ళ పైకి లాక్కుని వయ్యారంగా చూస్తూ అంది.

''ఒయమ్మ! సందమాటేలనుంచి సింగారించ్చుకూకున్నదిందుకా కుర్రడా? నీలాంటోడొస్తనే కదా మాలాటోల్ల కడువులు నిండతాయి?''

అంటూ టగరీ కొంగు విదిలేసింది. పక్కనున్న అమ్మాయిలు కిలకిలమంటూ అక్కడే కూలబడ్డారు.

ఖుటే కటువుగా అన్నాడు.

''ఇకటాలు చాలించి నా తిండి సంగ చ్చూడు!''

తడితడిగా వున్న ఓ ఐదురూపాయల కాగితం టగరీకి అందించాడు ఖుటె.

''అందర్రం కలిసే తినొచ్చు. ఎంటనే ఏదేనా పట్రా!''

ఓ నిముషం పాటు నలుగురు ఆడవాళ్ళు వింతగ నిశ్శబ్దంగా ఖుటెని పట్టి పట్టి చూసారు.

నడివయసామె ఖుటెనుంచి అయిదు కాగితం అందుకుంటూ–

''మాపిటేలయిపోనాది. ఏటి దొరికుద్దిప్పుడు? ఏ అటుకులూ, బెల్లవూ గానుంటాయేమో? దుకానం మడిసిని లెగొట్టి సూడాల!

ఆస్త్రీ చీకట్లోకి మాయం అయింది.

టగరీ ఖుటెని చూస్తూ అంది.

''అరే! గుడ్డల్నీ తడిచిపోనాయి. లోనకొచ్చి గుడ్డిడుసుకో!''

కర్ర తలుపు సగం తెరుచుకొని వుంది. టగరీ వెనకాలే ఖుటె లోపలికొచ్చాడు.

గదిలో ఓ మూల బోర్లించిన కుండ మీద కొవ్వొత్తి వెలుగుతూంది. దండెం మీద చిరిగి పోయిన రెండు చీరలు, మాసిపోయి నలిగి పోయిన ఓ జాకెట్టు వేలాడుతున్నాయి. మరోమూల కర్ర మంచం వుంది. దానిమీద రంగు బొంత పరిచి వుంది. గావంచాని చుట్టబెట్టిన జిడ్డు తలగడ ఒకటి తల వైపున వుంది. కర్ర మంచం కింద ఖాళీ అల్యూమినియం చిప్పలు ఓ గ్లాసు పడివున్నాయి. వాటి పక్కన ఓ రేకు సూటుకేసు దానిమీద పగిలిన అద్దం పడివున్నాయి.

వాటిని చూసిన ఖుటెకి ఊపిరి సలపనంత బాధ కలిగింది. పటకారు పెట్టి ఎవరో బలంగా తన గొంతు నులుముతున్న అనుభూతి! వాటికేసి చూస్తూనే చొక్కా బనీను విప్పేసి టగరీ చేతికి అందించాడు. టగరీ అంది.

''అరె! పంట్లం కూడా విప్పదియ్యి! ఆర్నాక కట్టుకోవచ్చును.''

ఖుటె ముఖంలో సిగ్గును చూసి టగరీ నవ్వుతూ అంది.

''అరె! పడుసుకునీదానింటికొచ్చి పంట్లం విప్పడానికి సిగ్గు పడతవేటి? ఇప్పివ్వు!''

ఖుటె టగరీ కళ్ళలోకి సూటిగా చూస్తూ మెల్లిగా అన్నాడు.

''అప్పసెల్లెలు దగ్గర తోడబుట్టినోడు పంట్లాం యిప్పలేడు!''

టగరీ చటుక్కున రెండడుగులు వెనక్కి వేసి కర్రతలుపుకి జారబడి నిలబడి పోయింది. కర్రతలుపు కీచుమంటూ మూసుకుంది. శిలా ప్రతిమలా టగరీ ఖుటెని చూస్తూ అలా వుండి పోయింది.

''ఏటయింది టగరీ?''

టగరీ ఖుటెని గుచ్చిగుచ్చి చూస్తూ బాదగ గద్గద స్వరంతో అడిగింది.

''శానా కాలం కిందటి సంగతి! నీలాగే ఒక సక్కటి బాబొచ్చినాడు. ఎలుగు రాకండ పోలీసు లొచ్చినారు. ఆ బాబు పారిపోలేక పోనాడు. ఈ నడవలోనే గుండేసి కొట్టేసినారు. ఆనక ఆ ఎములాల్లు నన్నట్టుకు పోనారు! ఐదు రోజుల పాటు ఆ ఎదవలు నా ఎముకలు రుసికూడా సూసేసి యిడిసేసినారు. సచ్చిపోయేముందాబాబు అన్నమాట నాకింకా గురుతే!--- సెల్లెమా! కూసిని మంచీలియ్యి తల్లీ అని!--- నువ్వు--- నువ్వలాటోడివి కాదు గందా?!''

టగరీ కనుకొలకులలోంచి నీరు చారికలు కట్టి చుబుకంనుంచి కిందకు చుక్క చుక్కలుగా రాల్తూంది.

బైటనుంచి నడివయసామె కేకలు ఎవరూ విని పించుకోవడంలేదు.

''అరె! టగరీ! కుర్రోడితో సరసంలోకి దిగి పోనావేటి? ఇందు! తీసుకో! అటుకులూ బెల్లవూ అట్టుగొచ్చినాను!''

ఖుటె ఆకలి మాటే మరిచిపోయాడు.

ఆక్షణంలో అతని మనసు నిండా ఒకే ఒక ప్రశ్న నిండి వుంది.

''ఆ నక్సలు బాబు ముఖం ఎలా వుంటుంది ?''

---

బేటా వాడ్ని మాత్రం నమ్మకు
వాడు జెండా లెగరేసే దొంగ
నీళ్ళున్న చోటికే
ఎగిరిపోయే కొంగ!
భయపడకు నీ చేతిలో
రాళ్ళున్నాయి రాకెట్లు లేకున్నా
ఛాతీలో గుండె ఉంది
చేతిలో బందూకుల్లేకున్నా...

** ** **

పారిపోయి గదిలో
బంధించుకోకు
కుర్చీలు నవ్వుతాయి గోడలు
ప్రశ్నలు రువ్వుతాయి
పటాలు ఉపన్యాసాల జలపాతాల్ని
విడుదల చేస్తాయి
కర్ణాట జాజ్ సంగీత దండ యాత్రల్లో
నీవు కొట్టుకు పోతావు...

** ** **

ఎందుకు నిరీక్షిస్తావు ఆ గదిలో
ఖైదీవై
ఏ ఉత్తరమూ నీ తలుపు కొట్టదు
ఈ దేశంలో వసంతం అడుగు పెట్టదు
ఎవడూ కోకిల గొంతు గుర్తు పట్టడు
ఎందుకు అంత నాజూకు జీవితం
మోస్తావు
నిన్ను కొలవడానికి ఒక్కోసారి
సముద్రం కూడా చాలదు
ఒక్కోసారి బిందువు క్కూడా
చోటు చాలదు!
నిరీక్షించు నేను
నీ కలంలోకి దిగుతాను
నీ కలల్లోకి దూకుతాను
నీ ఆకాశాన్ని చీల్చుకుని
పిడుగునై
అవతరిస్తాను......

— శేషేంద్ర